ప్రజాశక్తి
సోమవారం 4 సెప్టెంబరు 2023



ఆర్‌టిసి డ్రైవింగ్ స్కూల్ 14వ బ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ఎపిఎస్‌ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో ఇప్పటి వరకు 13 బ్యాచ్‌లకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చామని, 14వ బ్యాచ్ ఈనెల రెండో వారంలో ప్రారంభం కానుందని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్‌టిసి డ్రైవింగ్ స్కూల్ డ్రైవింగ్ శిక్షణతోపాటు బస్సు విడిభాగాలపై పూర్తి అవగాహన కల్పిస్తామని తెలిపారు. మెకానికల్ తరగతులు, యోగా, వ్యక్తిత్వ వికాసం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. 14వ బ్యాచ్‌లో చేరదలచిన వారు నేరుగా జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఇతర వివరాలకు 9963091999, 7382923293 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మాతృ వందన యోజనకు బ్రేక్



ప్రసవ సమయాన గర్భిణులకు ఆర్థికంగా సాయపడేందుకు ప్రారంభించిన ప్రధానమంత్రి మాతృ వందన యోజన (పిఎంఎంవివై)ను కేంద్ర ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపేసింది. ఈ పథకం రిజిస్ట్రేషన్లు ఈ ఏడాది మార్చి నుంచి ఆపేసింది. అప్పటి నుంచి ఎవరికీ లబ్ధి అందడం లేదు. పేద కుటుంబాల్లో గర్భిణుల ప్రసవ సమయానికి ముందు మంచి పోషకాహారాన్ని తీసుకునేందుకు ఈ సాయం ఎంతగానో ఉపయోగపడేది. కాన్పు సులభతరం కావడానికి వీలుగా తల్లీ, బిడ్డ క్షేమంగా ఉండాలన్న లక్ష్యంతో అందించే ఈ సాయం ఇప్పుడు విడుదల కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికితోడు కొత్త రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. కుప్పలు తెప్పలుగా గతంలో రిజిస్ట్రేషన్ చేసిన దరఖాస్తులకు సైతం మొండిచేయే. 2017లో ప్రారంభమైన ఈ పథకం ఈ ఏడాది మార్చి వరకు కొనసాగింది. తరువాత ఒడిదొడుకులకు గురైంది.

- మార్చి నుంచి ఆగిన రిజిస్ట్రేషన్లు
- కాన్పు సమయంలో అందని సాయం
- ఆరు నెలల్లో సుమారు 16 వేలు పెండింగ్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

పిఎంఎంవివై పథకం కింద రిజిస్ట్రేషన్ చేయించుకునే వారికి తొమ్మిది నెలల కాలవ్యవధిలో మూడు దఫాలుగా మొదటి కాన్పునకు రూ.5 వేలు ఆర్థికసాయం అందించే వారు. జిల్లాలో ప్రతి నెలా సుమారు 14 వేల మందికిపైగా గర్భిణులు అంగన్వాడీ, వైద్య ఆరోగ్య శాఖల లెక్కల ఆధారంగా నమోదవుతుంటారు. వారిలో తొలి కాన్పు నెలకు సుమారు 2500 నుంచి 2,700 మందికిపైగా ఉంటారు. వారి పేర్లను సంబంధిత ఆస్పత్రుల్లో ఆరోగ్య కార్యకర్త, ఆశా వర్కరు వద్ద నమోదు చేయించుకునేవారు. మొదటి మూడు మాసాల్లో రూ.వెయ్యి, ఆరో నెలలో తనిఖీలు చేసిన తర్వాత రూ.2 వేలు ఇచ్చేవారు. ప్రసవమయ్యాక బిడ్డకు మొదటి విడత టీకా కార్యక్రమం పూర్తయిన తర్వాత మిగిలిన రూ.2 వేలు తల్లి ఖాతాలో జమ చేసేవారు. ఈ ప్రక్రియ మొదలైన తర్వాత రిజిస్ట్రేషన్ ప్రక్రియను వైద్య ఆరోగ్య శాఖ, అంగన్వాడీ కేంద్రాల్లో చేపట్టేవారు. అక్కడ గర్భం దాల్చిన 90 రోజులలోపు రిజిస్ట్రేషన్ చేయించుకునేవారు. మార్చి నుంచి ఈ పథకంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఈ విషయం అధికారికంగా తెలియజేయకపోవడంతో ఆరు నెలల కాలంగా పేర్లు నమోదు చేసుకుంటూనే ఉన్నా ఆస్పత్రుల్లో రిజిస్ట్రేషన్ మాత్రం చేయడం లేదు. పేర్లు నమోదు చేయించుకున్న వారికి మొదటి విడత ఆర్థిక సాయం రూ.వెయ్యి అందలేదు.

జమకాని మూడో విడత సాయం

పాత పోర్టల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిలో కొందరికి ప్రసవం పూర్తయిన తర్వాత చెల్లించాల్సిన మూడో విడత ఆర్థిక సాయం ఖాతాలకు జమ కాలేదు. దీంతో క్షేత్ర స్థాయిలో ఆరోగ్య కార్యకర్తలపై ప్రజల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. పథకంలో కొన్ని మార్పులు జరుగుతున్నాయని, అందుకే రిజిస్ట్రేషన్లు నిలిపివేశారని ఆరోగ్య సిబ్బంది చెబుతున్నారు. పాత విధానం ప్రకారం పిఎంఎంవివై కింద మొదటి కాన్పునకు మాత్రమే ఆర్థిక సాయం అందించేవారు. తాజా మార్పుల్లో రెండో కాన్పులోనూ ఆడపిల్ల పుడితే పథకం వర్తింపజేస్తారని చెబుతున్నారు. అయితే కొత్త పోర్టల్ ఎప్పటినుంచి అందుబాటులోకి వస్తుందన్నది మాత్రం కేంద్రంగానీ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నుంచి గాని కచ్చితమైన సమాచారం లేదు. దీనికి తోడు గడచిన ఆరు నెలల కాలంలో వివిధ దశల్లో గర్భిణులకు అందాల్సిన సాయంపై ఎలాంటి వివరాలు చెప్పకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది అవస్థలు పడుతున్నారు.

కొత్త పోర్టల్ వస్తే తిరిగి నమోదు



ప్రజలకు రావాల్సిన ఏ పథకమైనా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే వేస్తున్నారు. గతంలో ప్రధాన మంత్రి మాతృ వందన పథకాన్ని కూడా గర్భిణులకు నేరుగా చెల్లించేవారు. అందులో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో రిజిస్ట్రేషన్ చేసేవారు. కానీ ప్రస్తుతం ఆ పోర్టల్‌ను ప్రభుత్వం నిలుపుదల చేసింది. పథకం కొనసాగుతున్నా పోర్టల్‌లో కొన్ని మార్పులు చేస్తున్నారు. అందువల్ల రిజిస్ట్రేషన్ కొంత ఆలస్యమవుతోంది. అర్హులైన ప్రతిఒక్కరికీ ఈ పథకం వర్తిస్తుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైన తర్వాత నిధులు విడుదలవుతాయి. కొత్త పోర్టల్ అందుబాటులోకి రాగానే రిజిస్ట్రేషన్ చేపట్టి అందరికీ సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

\- డాక్టరు బి.మీనాక్షి, డిఎంహెచ్‌ఒ

గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలి

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు



తొలగించిన టేకు చెట్లను పరిశీలిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం, రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి- మందస

గిరిజనుల భూములకు, వారి తోటలకు రక్షణ కల్పించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహన్‌రావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సవర ధర్మారావు, సవర ఫల్గుణరావు డిమాండ్ చేశారు. ఆదివారం మందస మండలంలోని చాపరాయికాలనీకి చెందిన గిరిజనుల భూములను ఆక్రమించి తొలగించిన టేకు చెట్లను వారు పరిశీలించారు. తరతరాలుగా గిరిజనుల సాగులో ఉన్న జిరాయతీ భూములను, వారు వేసుకున్న తోటలను, టేకు చెట్లను గిరిజనేతరులు కరగాన సుధా యాదవ్ తన అనుచరులు కలిసి తొలగించి, గిరిజనంపై దాడి చేయడం అన్యాయమన్నారు. గిరిజనులకు అన్ని రకాల హక్కు పత్రాలు ఉన్నప్పటికీ రాజకీయ నాయకుల అండతో దాడికి పాల్పడ్డారని తెలిపారు. గిరిజన మహిళలపై చేయి చేసుకోవడం దుర్మార్గమైన చర్యని వారన్నారు. ఈ విషయాన్ని అధికారులకు, పోలీసులకు తెలియజేసినా స్పందన లేకపోవడం దారుణమన్నారు. మందస ప్రాంతంలో కొంతకాలంగా గిరిజనులపై దాడులు చేసి, భూములను ఆక్రమించుకోవడం, తప్పుడు పత్రాలు సృష్టించి కొనుగోలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. కొంతమంది నాయకుల అండతో జరుగుతున్న ఈ అరాచకంపై ఉన్నతాధికారులు స్పందించి, గిరిజనుల భూములకు, పంటలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. తమ హక్కుల కోసం గిరిజనులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో సవర జయరాజ్, సవర బాలకృష్ణ, సవర జగ్గారావు, తిరుపతి, రామారావు, జ్వరాడు, తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 15, 16 తేదీల్లో

శ్రీకాకుళంలో జాతీయ సెమినార్

ప్రజాశక్తి - రణస్థలం

సిఐటియు జాతీయ నాయకులు పర్సా సత్యన్నారాయణ శత జయంతి ఉత్సవాలు సందర్భంగా అక్టోబర్ 15, 16వ తేదీల్లో శ్రీకాకుళంలో జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు తెలిపారు. ఆదివారం రణస్థలంలో హైస్కూల్ ఆవరణలో సిఐటియు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అమ్మన్నాయుడు మాట్లాడుతూ సిఐటియు ఆధ్వర్యాన నిర్వహించే సెమినార్‌కు యూనియన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత, రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శి ఎ.వి.నాగేశ్వరరావు, సి.హెచ్.నర్సింగరావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు హాజరవుతారని చెప్పారు. కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను సెమినార్‌లో చర్చిస్తామన్నారు. జాతీయ సెమినార్ జయప్రదానికి ఉద్యోగులు, కార్మికులు, సంస్థలు, శ్రేయోభిలాషులు తోడ్పడాలని కోరారు. సమావేశంలో యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఐ.నారాయణరావు, అంగన్వాడీ యూనియన్ రణస్థలం ప్రాజెక్టు అధ్యక్షులు బి.అప్పమ్మ, ఆశా వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి కాంతమ్మ, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి వి.లక్ష్మి, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు అమ్మన్నాయుడు

కాలువ ఇలా.. సాగు ఎలా?

నాలుగేళ్లుగా వంశధార నీరు అందని వైనం



గుర్రపుడెక్కతో నిండిన వంశధార కాలువ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఖరీఫ్ వచ్చిందంటే రైతులందరి చూపూ వంశధార కాలువపైనే ఉంటుంది. ఈసారైనా నీరు రాకపోతుందా? మా పంటలు పండక పోతాయా? అని ఆత్రుతగా ఎదురుచూడడం రైతులకు పరిపాటి అయింది. పూర్తిస్థాయిలో వర్షాలు లేకపోవడం, కాలువ ద్వారా నీరు చేరకపోవడంతో శివారు ఆయకట్టు బీడుగా మారుతోంది. పాలకుల నిర్లక్ష్యం కారణంగా నాలుగేళ్లుగా కాలువ కనీసం మరమ్మతులకు నోచుకోకపోవడంతో చుక్క నీరు రాక అధ్వానంగా మారింది. ఫలితంగా వేలాది ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకంగా మారుతుంది.

వంశధార ప్రధాన ఎడమ కాలువ 12 మండలాల్లోని 398 గ్రామాల పరిధిలో విస్తరించి ఉంది. ఎడమ ప్రధాన కాలువ ద్వారా 1,48,023 ఎకరాలకు సాగునీరు అందుతుంది. కాలువ నీరు 60 శాతం, వర్షం నీరు 40 శాతం కలిపి 2,480 క్యూసెక్కుల సాగునీరు అందాల్సి ఉంది. నందిగాం మండలం శివారు ప్రాంతం, వజ్రపుకొత్తూరు, పలాస మండలాలు శివారు భూములుగా పిలవబడుతున్నాయి. ఈ పరిధిలో సుమారు 12 వేల ఎకరాలకు ఈ కాలువ ద్వారా సాగునీరు అందాల్సి ఉంది. మూడు దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన కాలువలు కావడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. కాలువల్లో సుమారు రెండు మీటర్లు వరకు పూడికతో కప్పబడి ఉందని రైతులు చెబుతున్నారు. దీనికితోడు కాలువ పరిధిలో గుర్రపు డెక్క నీటి ప్రవాహానికి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుంది. ఖరీఫ్ ప్రారంభంలో వీటిని తొలగించడంతో పాటు రెండు మీటర్ల లోతున పూడిక తీయాల్సి ఉంది. 'రోమ్ నగరం తగలబడి పోతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించుకున్నారని' చరిత్ర పాఠంలో మాదిరిగా ఇక్కడ పాలకులు తయారైనారని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు శ్రమదానం చేసి గుర్రపు డొక్క తొలగిస్తే వంశధార అధికారులతో కుమ్మక్కై బిల్లులు చేసుకున్న నాయకగణం ఉందని రైతులు ప్రధానంగా ఆరోపిస్తున్నారు. పూడికలు యుద్ధ ప్రాతిపదికన తీస్తే తప్ప సాగునీరు శివారు భూములకు చేరడం ఈ ఏడాది కూడా గగనమే అంటూ రైతులు నిట్టూర్పు విడుస్తున్నారు. కనితివూరు 60 ఆర్ ఎల్ కాలువ ద్వారా వజ్రపుత్రుడు మండలంలో ఇరువైపుల వంశధార నీరు రావాల్సి ఉంది. కనితిఊరు నుంచి సీతంపేట మీదుగా ఉద్దానం గోపునాథపురం ఉద్దాన, మిరియాపుట్టి, పాతటెక్కలి, ఎస్.జె.పురం, పొల్లాడ మీదుగా దేవునల్తాడ వరకు 11 కిలోమీటర్లు. ప్రతాప విశ్వనాథపురం నుంచి మర్లపాడు మీదుగా ఉద్దానం కూర్మనాథపురం కొల్లిపాడు పెద్ద బొడ్డపాడు సీతాపురం కొండవూరు తీరపల్లి వరకు 60 ఆర్ ఎల్ కాలువ ఆరు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. ఇప్పటివరకు ఈ కాలువ పూర్తిగా మరమ్మతులకు నోచుకోలేదు.

వేసవిలో కాలయాపన



వేసవిలో కాలయాపన చేస్తూ వచ్చిన వంశధార అధికారులు ఖరీఫ్ ముంగిట కాలువ గట్టుపై హడావుడి చేస్తారు. అధికారులలో చిత్తశుద్ధి కొరవడుతుంది. పూడికలు, గుర్రపు డొక్క, పిచ్చి మొక్కలు తొలగించకుండా శివారు భూములకు సాగునీరు ఎలా అందుతుంది. రైతులను దగా చేయడమే.

\- చింత జయరాం, ఉద్దానం కూర్మనాథపురం

ఏటా ఇదేతంతు



గత నాలుగేళ్లుగా ఇదే తంతు. టెక్కలిపట్నం వద్దకు సాగునీరు వచ్చిందని ప్రచారం రావడంతో సంతోషంగా వెళ్లి చూశాం. నందిగాం మండలం జడ్యాడ వద్ద బందంగాయ చెరువు నిండితే చెరువు గండి పడుతుంది. నీరు వంశధార కాలువలోకి రైతులు విడిచి పెట్టారని తెలుసుకున్నాం. వంశధార నీరు అందించి రైతులను ఆదుకోవాలి.

\- బగాది బాలకృష్ణ, గుల్లలపాడు

ఉపాధి కల్పనలో పాలకులు విఫలం

పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన నిరసన



నిరసన చేపడుతున్న పిపిఎస్‌ఎస్ నాయకులు తిరుపతిరావు, నిరుద్యోగులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు టి.తిరుపతిరావు విమర్శించారు. అధికారంలోకి వస్తే ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలిస్తామని చెప్పిన మోడీ.. ఎక్కడ ఉద్యోగాలిచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఎన్‌జిఒ హోం వద్ద నిరుద్యోగ వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో కోట్లాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా సరే భర్తీచేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఉన్న ఉద్యోగాలతో పాటు ప్రభుత్వరంగ సంస్థలను ప్రధాని మోడీ తెగనమ్ముతు న్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా 1.50 లక్షల చిన్న, మధ్యతరగతి, భారీ పరిశ్రమలు మూత పడ్డాయని గుర్తుచేశారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో వైఫల్యం చెందారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి తక్షణమే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్.ఎర్రయ్య, జి.మౌలి, ఎస్.మురళీ, జి.అప్పలనాయుడు, ఎస్.నరేష్, కన్నబాబు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి


ఎండిఎం కార్మికుల సమస్యలపై

దశల వారీగా పోరాటం

ప్రజాశక్తి- పాతపట్నం

మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి దశల వారీగా పోరాటాలకు సిద్ధం కావాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు అల్లు మహాలక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం యూనియన్ మండల కార్యదర్శి టి.సీతమ్మ అధ్యక్షతన జరిగిన పాతపట్నం మండల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎండిఎం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్‌లో చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్‌ఐ ,ఉద్యోగ భద్రత, పింఛను వంటివి అమలు చేయకుండా శ్రమదోపిడీకి పాల్పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వాలు లక్ష్యానికి విరుద్ధంగా పథకాన్ని నీరుగార్చేందుకు నిరంతరం బడ్జెట్లో కోతలు పెడుతున్న పరిస్థితి నెలకొందన్నారు. పథకం అమలుకు పాఠశాలలో వంటషెడ్లు, వంట పాత్రలు, మంచినీరు, గ్యాస్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కల్పించకపోవడం అన్యాయమన్నారు. దఫదఫాలుగా మెనూలో మార్పులు చేస్తున్నారని, దీనివల్ల ఆర్థిక భారం పడుతోందని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరుగుతున్నా వాటికి అనుగుణంగా మెనూ ఛార్జీలను పెంపుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిఎం కార్మికలకు కనీస వేతనం ఇవ్వాలని, ప్రతి నెలా 5వ తేదిలోపు వేతనాలు, బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలని కోరారు. పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదన్నారు. వీటన్నింటిపై కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల నాయకులు కుమారి, లక్ష్మి, శాంతమ్మ, భవాని, ఎం.రామలక్ష్మి, కె.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సౌకర్యాల మెరుగుకు కృషి



క్రీడాకారుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ద్వారా కృషి చేస్తున్నామని సంస్థ సిఇఒ బి.వి.ప్రసాదరావు తెలిపారు. జిల్లాలోని క్రీడా మైదానాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పెద్దఎత్తున నిధులు అవసరమున్న కోడి రామ్మూర్తి స్టేడియం పునర్నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వానికి కొత్త ప్రతిపాదనలు పంపించినట్లు వివరించారు. జిల్లాలో క్రీడాకారులకు కొదవ లేదని, అన్ని రంగాల్లో రాణిస్తున్న వారికి ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. దాతల సహకారంతోనే క్రీడాకారులను పోటీలకు పంపిస్తున్నామని చెప్పారు. జిల్లాలో క్రీడల పరిస్థితి, క్రీడాకారులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆయన 'ప్రజాశక్తి'కి వివరించారు.

\- ప్రజాశక్తి, శ్రీకాకుళం అర్బన్

- నైపుణ్యంతో ఖ్యాతినార్జిస్తున్న క్రీడాకారులు
- కోడి రామ్మూర్తి స్టేడియానికి కొత్తగా ప్రతిపాదనలు
- 'ప్రజాశక్తి'తో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సిఇఒ ప్రసాదరావు ముఖాముఖి



? జిల్లాలో క్రీడల అభివృద్ధికి నిధుల విడుదలకు శాప్ సహకారం ఎలా ఉంది.?

జిల్లాలో వందల మంది క్రీడాకారులను డిఎస్‌ఎ శిక్షకులు తీర్చి దిద్దుతున్నారు. బాక్సింగ్, జూడో, వాలీబాల్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్, తదితర ఆటల్లో నైపుణ్యాలను పెంపొందిస్తున్నారు. నిధుల కొరత వేధిస్తుండటంతో అవసరాల మేరకు సొంతంగా సమకూర్చి వారిని పోటీలకు పంపిస్తున్నాం. ప్రభుత్వం నుంచి క్రీడలకు ప్రోత్సాహం ఉంది. శాప్ ద్వారా పూర్తి స్థాయి సహకారం అందుతోంది. ఉన్నత స్థాయి అధికారుల సూచనల మేరకు క్రీడాకారులకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తున్నాం.

? కోడి రామ్మూర్తి స్టేడియం పునర్నిర్మాణ పనులు ఎప్పటికి పూర్తవతాయి?

శ్రీకాకుళం నగరంలోని కోడిరామ్మూర్తి స్టేడియం అభివృద్ధి చేయాల్సి ఉంది. స్టేడియం కోసం ఇప్పటికే పలు దఫాలుగా ప్రభుత్వానికి నివేదించాం. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి హామీ మేరకు కొత్తగా ప్రస్తుత అంచనాలకు అనుగుణంగా ప్రతిపాదనలు తయారు చేసి పంపాం. మైదానంలో ప్రస్తుతం ఇండోర్ క్రీడలకు కొంత భాగాన్ని వినియోగిస్తున్నాం. స్టేడియం పూర్తి స్థాయిలో నిర్మాణం చేపడితే జాతీయ క్రీడల వరకు వేదికయ్యే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

? సౌకర్యాల మెరుగుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులుగా ఇటీవల డాక్టర్ కల్లేపల్లి శ్రీధర్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు క్రీడల పట్ల పూర్తి అవగాహన ఉంది. క్రీడాకారులకు ఏ సమయంలో ఏమి అవసరమన్నది తెలిసిన అధికారి రావడం అన్ని విధాలా డిఎస్‌ఎ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. మూలన పడిన బాక్సింగ్ రింగ్‌ను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. క్రీడాకారులు వ్యాయామం చేసేందుకు ప్రత్యేకంగా ఓ గదిని సిద్ధం చేయిస్తున్నాం. జూడో, బాక్సింగ్, కబడ్డీ, తైక్వాండోలకు క్రీడా సామగ్రిని గుంటూరు నుంచి, అథ్లెటిక్స్, ఖోఖో పరికరాలను సొంత నిధులతో ఏలూరు నుంచి రప్పించారు. ఇలా క్రీడాకారులకు కావాల్సినవన్నీ ఒక్కొక్కటిగా సమకూరుస్తున్నాం.

? వికాస కేంద్రాల నిర్వహణ ఎలా సాగుతోంది.?

జిల్లాలో క్రీడా వికాస కేంద్రాలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నాం. ప్రస్తుతం టెక్కలి, రణస్థలం, పాతపట్నం ప్రాంతాల్లో కేంద్రాలు వినియోగంలో ఉన్నాయి. ఆయా చోట్ల తైక్వాండో, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్ శిక్షకులను నియమించాం. పలాస, ఇచ్ఛాపురం, పాత్రునివలసలో కేంద్రాల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. నరసన్నపేటలో 60 శాతం వరకు పనులు జరిగాయి. వీటి పరిస్థితిపై ఇటీవల శాప్‌నకు నివేదిక పంపించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

'ఆడుదాం ఆంధ్ర' పోటీల నిర్వహణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

అక్టోబరు 2 నుంచి 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు మొదలవుతాయి. పోటీల నిర్వహణకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సన్నాహాలు చేస్తోంది. అందులో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు జరగనున్నాయి. జిల్లాలోనూ గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఈ పోటీలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ మండలస్థాయి అధికార్లతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పూర్తి స్థాయి సూచనలు చేశారు. వారి ఆదేశాలకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో ఈ ప్రక్రియ మొదలైంది.


గోతిలో వరినాట్లు వేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి నాయకుల వినూత్న నిరసన

ప్రజాశక్తి- పొందూరు
చిన్నపాటి వర్షానికే బురదమయమై అధ్వానంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నామని మండలంలోని కేశవదాసుపురం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి అంతటా గోతులు ఏర్పడి అధ్వానంగా ఉండడంతో వాహనదారులు, నడిచి వెళ్లేవారు సైతం తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీంతో ఆదివారం బురదమైన రహదారిలో వరి నాట్లు నాటుతూ మాజీ సర్పంచ్, టిఎన్ టియుసి జిల్లా అధ్యక్షులు గాడు నారాయణరావు, గ్రామస్తులు వినూత్న నిరసన తెలిపారు. టిడిపి హయాంలో బిటి రోడ్డు నిర్మాణానికి రూ.48 లక్షలు మంజూరయ్యాయని, కానీ, 25 శాతం కన్నా తక్కువ జరిగిన పనుల రద్దులో భాగంగా కేశవదాసుపురం రోడ్డు నిర్మాణం ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. దీంతో ఈ నాలుగేళ్లలో రోడ్డు పరిస్థితి మరింత దిగజారిందన్నారు. రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో అవస్థలు పడుతున్నారని అన్నారు.

ఇంకెన్నాళ్లు..!

- బిల్లుల కోసం తిరుగుతున్న కాంట్రాక్టరు
- చెల్లించకపోవడంతో పనులు నిలుపుదల

ప్రజాశక్తి- పలాస
రెండు మండలాలకు కలిపే డబుల్ రోడ్డు పనులు ముందుకు సాగడం లేదు. రోడ్డు మంజూరై రెండేళ్లు కావస్తున్నా పనుల శాతం అంతంత మాత్రంగానే ఉంది. మంజూరైన రోడ్డు పనులు నిలిచిపోగా పాత రోడ్డు పూర్తిగా పాడవడంతో వాహన చోదకులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కోట్లు వెచ్చించి రోడ్డు పనులు చేపట్టినా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో కాంట్రాక్టులు ఎక్కడ పనులు అక్కడే వదిలేయడంతో వాహన చోదకులు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

మండలంలోని రేగులపాడు నుంచి వజ్రపుకొత్తూరు మండలం నువ్వులరేవు వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం సెంట్రల్ రోడ్డు ఫండ్ నిధుల కింద రూ.25 కోట్లు మంజూరు చేసింది. దీంతో రోడ్డు పనులు ప్రారంభంలో శరవేగంగా సాగాయి. ఇబ్బందులు తీరుతాయని వాహన చోదకులు స్థానికులు ఆనందపడ్డారు. గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మించకపోయిన వైసిపి ప్రభుత్వం హయాంలో రోడ్డు పూర్తవుతాయని ఆనంద పడుతున్న సమయంలో రోడ్డు పనులు అటకెక్కింది. నువ్వులరేవు నుంచి రేగులపాడు వరకు 16 కిలోమీటర్లు పొడవునా తారు రోడ్డు పనులు చేయాల్సి ఉంది. కానీ, కేవలం 30 శాతం పనులు చేపట్టి కాంట్రాక్టర్ చేతులు ఎత్తేశారు. రెండేళ్ల క్రితం కాశీబుగ్గ పెట్రోల్ బంకు నుంచి వజ్రపుకొత్తూరు వరకు డబుల్ రోడ్డు నిర్మించేందుకు న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు రూ.20 కోట్లు నిధులు మంజూరు చేశారు. పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి


అధ్వానంగా ఉన్న రోడ్డు

అక్కడే అన్న చందంగా తయారైంది.

బిల్లులు చెల్లించలేదు

ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇస్తే అధికారులు కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చి పనులు చేయిస్తున్నారు. బిల్లుల కోసం అదే తరహాలో కాంట్రాక్టర్లు కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. బిల్లులు ఎప్పుడు వస్తాయో అంటూ ఎదురుచూస్తున్నామని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెడితే బిల్లులు మాత్రం సకాలంలో రావడం లేదని వాపోతున్నారు. నువ్వులరేవు నుంచి రేగులపాడు వరకు సుమారు 16 కిలోమీటర్లు పొడవునా తారు రోడ్డు నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరైంది. ఇప్పటి వరకు రోడ్డు పనులతో పాటు మోదుగులపుట్టి ప్రాంతంలో వంతెన, వెంకటాపురంలో సిసి రోడ్డు నిర్మాణ పనులు జరిగాయి. సుమారు 30 శాతం పనులకు సుమారు రూ.9 కోట్ల వ్యయంతో కాంట్రాక్టర్ రోడ్డు పనులు చేపట్టారు. అలాగే కాశీబుగ్గ పెట్రోల్ బంక్ నుంచి వజ్రపుకొత్తూరు వరకు రోడ్డు పనుల్లో భాగంగా సుమారు రూ.3.50 కోట్లు వెచ్చించి పనులు చేపడితే రెండేళ్లు కావస్తున్నా... ప్రభుత్వం చేసిన పనులకు గాను ఒక్క రూపాయి నిధులు మంజూరు చేయకపోవడంతో తాము రోడ్డు పనులు చేయలేని కాంట్రాక్టర్లు చేతులు ఎత్తేశారు. దీంతో ఆర్‌అండ్‌బి అధికారులు, కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చినా ఫలితం లేకపోయింది. ప్రభుత్వ నిర్లక్ష్యానికి అటు కాంట్రాక్టర్ మరోవైపు వాహన చోదకులు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక రోడ్డు పనులు చేపట్టేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందంటే రోడ్డు పూర్తయ్యే వరకూ ఎటువంటి అదనపు పనులు గానీ, తాత్కాలిక పనులు గానీ, మరమ్మతులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయదు. దీంతో గత రెండేళ్లుగా వాహన చోదకులు స్థానికులు ఇబ్బందులు పడి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డు పాడైందని అధికారులకు తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి చేసిన పనులకు కాంట్రాక్టర్ నిధులు మంజూరు చేసి తారు రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు, పాదచారులు, స్థానికులు కోరుతున్నారు. ఇదే విషయంపై పలాస ఆర్‌అండ్‌బి ఎఇఇ విక్రమ్‌ను వివరణ కోరగా, రేగులపాడు నుంచి వెంకటాపురం వరకు రోడ్డు పాడైందని, సిఆర్‌ఎఫ్ నిధులతో డబుల్ రోడ్డు పనులు చేపడుతున్నామని అన్నారు. అలాగే కాశీబుగ్గ పెట్రోల్ బంకు నుంచి వజ్రపుకొత్తూరు వరకు న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులతో పనులు చేపట్టామని అన్నారు. కాంట్రాక్టర్లకు చేసిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించకపోవడంతో ప్రస్తుతం రోడ్డు పనులు పూర్తి స్థాయిలో జరగలేదన్నారు. త్వరలో సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి తారు రోడ్డు పనులు పూర్తి చేసి ప్రయాణానికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని చెప్పారు.

రోడ్డు పొడవునా గోతులమయం

పలాస మండలం రేగులపాడు నుంచి వజ్రపుకొత్తూరు మండలం వెంకటాపురం వరకు చాలా ఏళ్ల క్రితం రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డుపై నిత్యం వాహనాల తాకిడి ఎక్కువగా ఉంటుంది. వెంకటాపురం, వీరభద్రపురం, మోదుగుల పుట్టి, టెక్కలిపట్నం, రేగులపాడు వరకు తారు రోడ్డు పూర్తిగా పాడైంది. రోడ్డు పొడవునా గొంతులతో నిండి పోయింది. ఈ రోడ్డుపై ప్రయాణం చేయలేక వాహన చోదకులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ రోడ్డు మెళియాపుట్టి మండలం చీపురుపల్లి, పెద్దమడి, చాపర, మెళియాపుట్టి ప్రాంతాలు కలుపుతూ ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి వెళ్లేందుకు ప్రధాన రహదారి. ఈ రోడ్డులో ప్రయివేటు బస్సులతో పాటు ఆర్‌టిసి, భారీ వాహనాలు రాకపోకలు చేస్తున్నాయి. రోడ్డుపై గోతులు ఉండడంతో ప్రయాణం చేయలేకపోతున్నామని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో గోతులో వాహనాలు దిగుబడి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

చిన్నపాటి వర్షం కురిస్తే చాలు రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉండడంతో ప్రయాణం చేసేందుకు ఇబ్బందిగా ఉందని వాహన చోదకులు, పాదచారులు, స్థానికులు వాపోతున్నారు. పాడైన రోడ్డుపై ప్రయాణం చేయడం ద్వారా ఎక్కువగా ద్విచక్ర వాహనాలు పాడవుతున్నాయని, ప్రమాదాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా కాశీబుగ్గ పెట్రోల్ బంకు నుంచి వజ్రపుకొత్తూరు వరకు చేపడుతున్న పనుల్లో కేవలం కల్వర్టు పనులు మాత్రమే చేపట్టారు. రోడ్డు పనులు పూర్తి స్థాయిలో జరగడం లేదు. రోడ్డు పనుల్లో జాప్యం జరుగుతోంది.


చెస్ పోటీలను పరిశీలిస్తున్న ఈశ్వరరావు

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

రణస్థలం రూరల్ : విద్యార్థులు విద్యాతో పాటు క్రీడల్లో రాణించాలని ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు, డైరెక్టర్ ఎన్.తేజ అన్నారు. స్కూల్ క్రీడా ప్రాంగణంలో ఆగస్టు 29 నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా మా ఇంట్రా స్పోర్ట్స్ మీట్ ఫైనల్స్‌ను ఆదివారం నిర్వహించారు. అందులో చెస్, ఫుట్‌బాల్, క్రికెట్, మ్యూజికల్ చైర్, రనింగ్ తదితర ఆటలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు శారీరక దృఢత్వాన్ని మాత్రమే కాకుండా మానసిక ఉల్లాసాన్నీ పెంపొందించడంలో క్రీడల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో బంటుపల్లి సర్పంచ్ ఎన్.రజని, ప్రిన్సిపాల్ శ్రీదేవి మహంతి, వైస్ ప్రిన్సిపాల్ ఎన్.సుధీర్‌కుమార్, స్కూల్ ప్రెసిడెంట్ రామకృష్ణ, టిడిపి నాయకులు పి.వి.రమణ పాల్గొన్నారు.

ఇంటర్ విద్య భవిష్యత్‌కు పునాది

వజ్రపుకొత్తూరు: ఇంటర్ విద్య భవిష్యత్‌కు పునాదని విశ్రాంతి డిప్యూటీ డిఎంహెచ్ఒ చాపర లీలాకోదండరావు అన్నారు. మండలంలోని పూండి సాయి వినీత్ విద్యా సంస్థల అధ్వర్యాన ఆదివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులు మానసిక సంఘర్షణ అదుపులో పెట్టుకోవాలన్నారు. ఉన్నత విద్యకు ఇంటర్ విద్య పునాది వంటిదని అన్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్ మేనేజ్‌మెంట్ వంటి ఉన్నత చదువులు లక్ష్యంగా విద్యార్థులు నిరంతరం ముందుకు సాగాలన్నారు. క్రమశిక్షణ విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేరుస్తుందన్నారు. అన్ని వసతులతో కూడిన గుణాత్మక విద్య బోధనకు సాయి వినీత్ విద్యా సంస్థలు చిరునామాగా నిలవడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యా సంస్థ అధినేత చాపరా కోదండరావు, కళాశాల ప్రిన్సిపాల్ అన్నేపు కైలాసరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీను, అధ్యాపకులు బచ్చాల ధర్మారావు, సూల షణ్ముఖరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లీల

నేడు ధర్నా

పోలాకి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా సోమవారం మండల కేంద్రాల వద్ద ధర్నాలు చేపడుతున్నామని, దీనిని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు పిలుపునిచ్చారు. మండలంలోని ఉరజాంలో సమరభేరిలో భాగంగా ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ధరలు అరికట్టడంలోనూ, ఉపాధి కల్పించడంలోనూ ఘోరంగా విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని అన్నారు.


మాట్లాడుతున్న గోవిందరావు

కార్యక్రమంలో సిపిఎం నాయకులు గురజాన రమణ, జోగి కన్నయ్య, జోగి నరసింహ, గురజాల శ్రీను, కోటరాజు, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.


'శాక్స్' ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి- పలాస
నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ పరిధిలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఎపి శాక్స్ ఉద్యోగుల జిల్లా సంఘం అధ్యక్షులు బగాతి శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి రోణంకి భూపతిరావు డిమాండ్ చేశారు. పలాస ప్రగతి భవన్‌లో పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు ఆదివారం వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 ఏళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగులుగా చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 1200 మంది ఉద్యోగులు వివిధ హోదాల్లో డాక్టర్లు, కౌన్సిలర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్‌నర్సులు, సూపర్‌వైజర్లు, ఫార్మాసిస్టులు, అకౌంటెంట్‌లు, డేటా మేనేజర్లుగా పని చేస్తున్నారని అన్నారు. నిత్యం ప్రజాసేవలో భాగస్వామ్యంగా ఉన్న తమను తక్షణమే క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నడుస్తున్న ఎపి శాక్స్ ఉద్యోగులు ప్రభుత్వాస్పత్రులకు వచ్చిన రోగులకు కౌన్సెలింగ్ ఇస్తూ, హెచ్ఐవి పరీక్షలు నిర్వహిస్తూ, నిత్యం మందులు సరఫరా చేస్తున్నామని తెలిపారు. హెచ్ఐవి సోకిన వారి ఆత్మహత్యలను తగ్గిస్తూ, వారి జీవితకాలం పెరిగేలా తగు సూచనలు, సలహాలు అందిస్తున్నామని చెప్పారు. ఇందులో పనిచేసే వారిలో ఎక్కువ మంది ఉద్యోగులకు ఇప్పటికే వయసు దాటిపోవడం వల్ల ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యాన నడుస్తున్న జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అనుమతితో ఇటీవల ఒడిశా, మణిపూర్ రాష్ట్రాల్లో హెచ్ఐవి అండ్ ఎయిడ్స్ కంట్రోల్ విభాగంలో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసినట్లు మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ... సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి క్రమబద్ధీకరణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నాలుగు రోజులు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- పలాస
పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్ శాఖ డిఇ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. కె.టి.రోడ్డు, చేపల మార్కెట్, ఉదయపురం, పురుషోత్తపురం, సూదికొండ, శివాజీనగర్, సాయి కాలనీ, వివేకానంద కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నా మని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.


ఎమ్మెల్సీ దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

ప్రజా సేవకే అంకితం

ప్రజాశక్తి- కవిటి
తన జీవితం ప్రజాసేవకే అంకితమని, ఆదరించి అభిమానించి తన ఎదుగుదలకు తోడ్పడిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలని నర్తు రామారావు అన్నారు. మండలంలోని బల్లిపుట్టుగ పంచాయతీ యలమంచిపుట్టుగలో ఆదివారం ఎమ్మెల్సీ నర్తు రామారావు దంపతులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దంపతులను ఊరేగింపుగా తీసుకువచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి రజనీకుమార్ దొలాయి, వైసిపి నాయకులు, గ్రామపెద్దలు, పాల్గొన్నారు.


నందిగాం : క్షతగాత్రుడి వివరాలు తెలుసుకుంటున్న మంత్రి

వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు

వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలయ్యాయి. లావేరు మండలం బుడుమూరు కూడలి సమీపంలో ఆటోను కారు ఢీకొని ఐదుగురికి, అదపాక వద్ద టిప్పర్ ఢీకొని ఒకరికి, నందిగాం మండలం తురకలపేట వద్ద కారు ఢీకొని మరొకరు గాయపడ్డాడు.

ప్రజాశక్తి- లావేరు
మండలంలోని జాతీయ రహదారి బుడుమూరు కూడలి సమీపంలో ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో విజయనగరం జిల్లా వేపాడ మండలం తెట్టంగికి చెందిన అల్లాడ సాంబశివ, తన భార్య సౌమ్య, మామ టి.సూర్యనారాయణ, సత్యవతి, గణేష్‌లు గాయపడ్డాడు. ఉదయం అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ దర్శనానికి ఆటోలో వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా... వెనుక నుంచి ఆటోను కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే స్థానికులు 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు.

అలాగే అదపాక సమీపంలో టిప్పర్ ఢీకొని రణస్థలం మండలం కొండములగాంకు చెందిన పిన్నింటి గౌరినాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీకాకుళం నుంచి సుభద్రాపురం వైపు సర్వీసు రోడ్డులో వెళ్లాల్సిన టిప్పర్ లారీ వంతెన పైకి వెళ్లి వెనుక తిప్పుకొని వస్తున్న సమయంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తిని బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంతో ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జుకాగా వ్యక్తికి తలకు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. ఈ ప్రమాదాలపై ఎస్ఐ కోటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నందిగాం : మండలంలోని తురకలకోట వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటిపల్లికి చెందిన దట్టి అప్పయ్య గాయపడ్డాడు. పలాస మండలం తాళ్లభద్ర తన బంధువుల పెళ్లికి వెళ్లి తిరిగి బైక్‌పై వస్తున్నారు. తురకల వద్ద అదే రోడ్డులో వస్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సమయంలో పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అదే రోడ్డులో వెళ్తున్నారు. కారులో నుంచి దిగి క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స నిర్వహించి వివరాలు సేకరించారు. జాతీయ రహదారి అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

22 ద్విచక్ర వాహనాలు సీజ్

టెక్కలి రూరల్ : ఎస్‌పి జి.ఆర్.రాధిక, డిఎస్‌పి డి.బాలచంద్రారెడ్డి ఆదేశాల మేరకు టెక్కలిలో ఆదివారం ఉదయం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ మేరకు టెక్కలిలో రాందాసుపేట, గొల్లవీధి తదితర ప్రాంతాల్లో ఎస్ఐ-1,2 ఎల్.రామకృష్ణ, రమేష్‌బాబు, నౌపడ ఎస్ఐ కిషోర్ ఆధ్వర్యాన పోలీస్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు, నంబరు ప్లేట్లు లేని 22 ద్విచక్రవా హనాలు సీజ్ చేశారు.

193 మంది ఉపాధ్యాయులకు పురస్కారాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాల సభా మందిరంలో శ్రీశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యాన జిల్లాలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న 193 మంది ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను ఆదివారం అందజేశారు. శ్రీశ్రీ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ చిందు శ్రీకాంత్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో డిఇఒ కె.వెంకటేశ్వరరావు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.రమణమూర్తి, విశాఖపట్నం గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పి.సుందరయ్యలు పాల్గొని ఈ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తీ ఉన్నతి వెనుక ఉపాధ్యాయుని పాత్ర ఎంతో కీలకమని అన్నారు. వారిని గౌరవించుకోవడం ఎంతో అవసరమన్నారు. వ్యక్తులపై కంటే, వ్యవస్థలపై వారికున్న బాధ్యత ప్రశంసనీయమన్నారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు

కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్య చంద్రరావు, హిరమండలం ఎంఇఒ కిలారి రాంబాబు, డాక్టర్ మంత్రి వెంకటస్వామి, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు మేనేజర్ డాక్టర్ టి.మణికంఠ, డాక్టర్ మోహనరావు, ఇండియన్ ఆర్మీ కాలింగ్ డైరెక్టర్ బి.వి.రమణ, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.ప్రవల్లికాప్రియ, అప్పస్మా స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బి.లక్ష్మణరావు, బాలాత్రిపుర కాల భైరవ ఆలయం వ్యవస్థాపకులు గణేష్, ఎస్.జోగినాయుడు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ పాల్గొన్నారు.

నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు రక్షణకు పోరాటం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు
భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు రక్షణకు పోరాటాలకు సిద్ధం కావాలని భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎన్.మోహనరావు పిలుపు నిచ్చారు. మండలంలోని బెండి కొండ తోటలో భూపతి అధ్యక్షతన ఆదివారం భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను అమలు కోసం ఏర్పటు చేసిన బోర్డులోని నిధులను పక్కదారి పట్టించిన ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కావాలన్నారు. నిర్మాణ కార్మికులు ప్రమాదంలో, సాధారణంగా మృతి చెందితే ఆ కుటుంబానికి రూ.2 రెండు నుంచి రూ.ఐదు లక్షలు పరిహారం, పిల్లల చదువులకు స్కాలర్‌సిప్‌లు, ఆడపిల్ల పెళ్లిళ్లకు ఆర్థిసాయం వంటి అనేక సంక్షేమ పథకాలు అమలులో ఉండేవన్నారు. ప్రభుత్వం ఆ నిధులను దారిమళ్లించి కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కార్మిక సంఘం నిధులు కార్మికులకు దక్కాలంటే పోరానికి సిద్ధ పడాలన్నారు. సిఐటియు జిల్లా నాయకులు ఎన్.గణపతి, పూర్వ సిఐటియు నాయకులు బి.ఆనందరావులు మాట్లాడుతూ


సమావేశమైన భవన నిర్మిణ కార్మికులు

మండలంలోని భవన నిర్మాణ కార్మికులను కలుపుకొని ముందుకు సాగడం ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికులు ఆందోళన సిద్ధం అవుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో దువ్వాడ సోమయ్య, గోవిందరావు, టివాసు, రామారావు, ఎస్.మల్లేసు, రామకృష్ణ పాల్గొన్నారు.

వైసిపి పాలనలో చీకటి రోజులే

బూర్జ: వైసిపి ప్రభుత్వం చీకటి రోజులేనని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. మండలంలో అల్లినలో ఆదివారం జరిగిన ఓ పెళ్లి కార్యక్రమంలో పాల్గొని విలేకరులతో మాట్లాడారు. ముందస్తు ప్రణాళికలు లేకపోవడం, విద్యుత్‌ను కొనుగోలు చేయకపోవడంతో ఎడాపెడా కోతలు విధిస్తున్నారని అన్నారు. కాలువల్లో


రవికుమార్

పూడికలు తీయించకపోవడంతో పంట పొలాలకు సాగునీరు అందడం లేదని, దీంతో రైతులు సాగునీటి కోసం అవస్థలు పడుతున్నారని అన్నారు. మరో వైపు వర్షాలు లేకపోవడంతో కరువు ఛాయలు అలుముకున్నాయని అన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈయన వెంట టిడిపి మండల పార్టీ అధ్యక్షులు వి.సీతారాంబాబు నాయుడు, టి.వైకుంఠరావు, అంపిలి గణపతిరావు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న వెంకటరావు చిట్టి

పలాస: ప్రభుత్వం పంచాయతీలకు మంజూరు చేస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్లలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని పలు వీధులు, బజార్ ప్రాంతాల్లో సిసి రోడ్లు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలు రీత్యా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు దంతం వైకుంఠరావు, కర్ర గంగాధర్, ఉప సర్పంచ్ పొందర ఈశ్వరరావు, గరికి ధర్మారావు, కోరాడ నాగరాజు, తులసి, పొందర అప్పన్న, వసంతులు, మెట్ట జగన్నాయకులు పాల్గొన్నారు.

స్థానికులకు అవకాశం ఇవ్వాలి


మాట్లాడుతున్న తులసీవరప్రసాదరావు

ప్రజాశక్తి- కొత్తూరు
వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో స్థానికులకే అవకాశం ఇవ్వాలని వైసిపి జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు అన్నారు. స్థానిక చిట్టిబాబు కళ్యాణ మండపంలో ఆదివారం అభినందన సభ నిర్వహించారు. కోశాధికారిగా పార్టీ నియమించడంతో కార్యకర్తలు, నాయకులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డిని రెండోసారి సిఎంను చేసేందుకు కార్యకర్తలందరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. పేదలందరికీ నేరుగా సంక్షేమ పథకాలు అందించే ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బమ్మిడి జగన్నాథం, శ్రీనివాసరావు, శ్యాంబాబు, పి.హరిబాబు, మజ్జి భుజంగరావు, కోయిలాపు సంజీవరావు, బి.రామకృష్ణ, టి.రమణారావు, కె.గోవిందరావు, పి.అర్జున్, తాతబాబు, ఎ.నాగేశ్వరరావు, ఎస్.రమేష్, జి.వెంకటకృష్ణ, ధర్మారావు, బి.శ్రీరాములు పాల్గొన్నారు.

ఎస్ఇఎంఎస్ ఒలింపియాడ్‌లో ప్రతిభ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి
సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న తంగి జగదీష్ విజయనగరంలో ఆదివారం నిర్వహించిన ఎస్ఇఎంఎస్ ఒలింపియాడ్ పరీక్షలో రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు సాధించారు. దీంతో నగదు బహుమతితో పాటు



సన్మానిస్తున్న నిర్వాహకులు

ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అలాగే ఉపాధ్యాయుడు చలపాక రమణకు దుశ్శాలువ కప్పి సన్మానించాఉ. విద్యార్థి విజయంపై ప్రధానోపాధ్యాయులు బరాటం కామరాజు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.


ట్రోఫీని అందజేస్తు విశ్వక్సేన్

క్రికెట్ టోర్నీ విజేత నాతవలస

రణస్థలం రూరల్: జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని నాయకులు వడ్డాది శ్రీనివాసరావు ఆధ్వర్యాన వరిసాంలో రెండు రోజులుగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్ నాతవలస, వరిసాం టీములు తలపడ్డాయి. ఈ పోటీలో నాతవలస టీమ్ మొదటి స్థానంలో నిలిచింది, రెండో స్థానంలో వరిసాం టీం నిలిచింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎచ్చెర్ల నియోజకవర్గ ప్రోగ్రాం కమిటీ చైర్మన్ విశ్వక్సేన్ మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.పది వేలుతో పాటు మెమోంటోలను అందజేశారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో అప్పన్న, నడుపూరు శంకర్, బాబాజీ, మునకాల కూర్మారావు, సత్య ప్రసాద్, త్రినాథ్, శ్రీను, సత్తిబాబు పాల్గొన్నారు.

స్టేషనరీ పంపిణీ

కవిటి : జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని జనసేన నాయకుడు లోళ్ల రాజేష్ ఆదివారం మండలంలో పలు


కవిటి : స్టేషనరీ వస్తువులతో విద్యార్థులు

కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా రాజపురంలోని బిసి వసతి గృహ విద్యార్థులకు స్టేషనరీ వస్తువులు అందించారు. అలాగే స్థానిక చింతామణి అమ్మవారి గుడిలో భవన నిర్మాణ కారికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇద్దివానిపాలెంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ప్రశాంత్, పృథ్వి, దాసు, కాళి పాల్గొన్నారు.

సొంతలాభం కొంత మానుకుని..


కవిటి : ఆర్థిక సాయం అందిస్తున్న పాటిసొన్నాపురం గ్రామస్తులు

ప్రజాశక్తి- కవిటి

సొంత లాభం కొంత మానుకుని పొరుగువానికి తోడుపడవోయి అన్న గురజాడ కవిత నేటి తరం యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ముఖ్యంగా ఇటీవల కాలంలో ప్రతీ గ్రామంలో స్వచ్ఛంద సంస్థలు ఏర్పడి ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తుంటే, గ్రామాల్లో ఉన్న యువత తాము కూడా సమాజ సేవకు సిద్ధమే అంటున్నారు. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని కొత్తవరక గ్రామానికి చెందిన ఎన్ని వినాయకరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నంలో చికిత్స పొందుతున్నారు. చేతికి అందువచ్చిన కొడుకు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ముదిమి వయసులో ఉన్న తన తల్లిని, అనారోగ్యంతో ఉన్న వినాయకరావుని భార్య సాకుతోంది. అయితే రోజురోజుకూ వ్యాధి తీవ్రత పెరగడం, ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే అవడంతో వినాయకరావు స్థానిక స్వచ్ఛంద సంస్థలు, తెలిసిన యువతకు తన ధీనగాథ వివరించారు. దీనిపై వెంటనే స్పందించిన పాటి సొన్నాపురం గ్రామస్తులు గ్రామానికి చేరుకుని స్థానిక సర్పంచ్ ప్రతినిధి శ్రీకాంత్ పురియా చేతులు మీదుగా వారికి రూ.10వేలు అందించారు. అదేవిధంగా కుసుంపురానికి చెందిన మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు వినాయకరావుకు రూ.5వేలు అందించారు. కార్యక్రమంలో పొల్లాయి అశోక్, బెండి జగదీష్, దేవరాజు పురియా, పురియా జనార్ధన్, స్థానికులు పాల్గొన్నారు.

అలాగే మండలంలోని నెలవంకలో గత నెల 31న జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన పీత బైరమ్మకు స్వచ్ఛంద సంస్థలతో పాటు పలువురు అండగా నిలుస్తున్నారు. అందులో భాగంగా స్థానిక అబ్దుల్ కలామ్ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం గ్రామానికి చేరుకుని రూ.5 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు, రూ.3వేలు నగదు అందించారు. అలాగే ఎఎబి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి బాధితులకు దుప్పట్లు, దుస్తులు, వంట సామగ్రి అందించారు. స్థానిక సర్పంచ్ ప్రతినిధి కుమార్ మోహన్‌రెడ్డి రూ.2 వేలు, నెలవంక వడ్డిపుట్టుగ గ్రామస్తులు రూ.15 వందలు, బియ్యం బస్తా అందించారు. కార్యక్రమంలో జానకిరావు, వెంకటేశ్వరరావు, నాగేష్, నర్తు సోంబాబు, జగ్గారావు, తులసి పాల్గొన్నారు.

పలాస : పలాస శివాజినగర్‌కు చెందిన నిరుపేద జీడీ కార్మికుడు ఇప్పిలి బాలరాజు కుమార్తె కళ్యాణి ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందింది. కళ్యాణి పనిచేసే శ్రీకృష్ణ ఆస్పత్రి డాక్టర్ జగదీష్, ఫిజియోథెరఫీ విభాగం చెందిన ప్రశాంత్ సంయుక్తంగా మృతిరాలు కుటుంబానికి ఆదివారం 19 వార్డు కౌన్సిలర్ ప్రతినిధి శిష్టి గోపి చేదుల మీదుగా రూ.80 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఫిజియోథెరఫీ ప్రశాంత్, బద్రి గవర్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీకాంత్

వైసిపి కార్యాలయం ప్రారంభం

కొత్తూరు : స్థానిక పేద్ద వీధిలో వైఎస్ఆర్ కార్యాలయాన్ని కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ ఆదివారం ప్రారంభించారు. ముందుగా నాలుగు రోడ్ల కూడలి నుంచి బాణసంచాలు కాల్చుకుంటూ ఊరేగింపుగా వచ్చారు. అనంతరం అట్టహాసంగా ప్రారంభించి వైసిపి నాయకులు గోగుల వరప్రసాద్ నాయుడు అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నూటికి నూరు శాతం ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అన్నారు. విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించారని తెలిపారు. నిరంతరం ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్ఎన్‌పేట జెడ్‌పిటిసి కిల్లారి త్రినాథరావు, పడల లక్ష్మణరావు, మొజ్జాడ చక్రపాణి, తోట కిరణ్‌కుమార్, కుంచాల నూకరాజు, గార రాజులనాయుడు, పాడి అప్పారావు, ఎ.ఉమామహేశ్వరరావు, ఆదినారాయణ, పొడిలాపు శ్రీనివాసరావు, గణేష్, చిన్నయ్య, జె.రామకృష్ణ, పి.రామారావునాయుడు పాల్గొన్నారు.


పోస్టర్ పంపిణీ చేస్తున్న దుర్యోధన

గ్రామాల్లో భవిష్యత్‌కు గ్యారంటీ

మందస: మాజీ మంత్రి గౌతు శివాజీ నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులు తెచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారని, గిరిజన ప్రాంతాల్లో తారు రోడ్లు వేయించిన ఘనత ఆయనకే దక్కిందని టిడిపి మండల అధ్యక్షులు బి.దుర్యోధన అన్నారు. మండలంలోని కొంకడాపుట్టి పంచాయతీ బి.వై.ఆర్.పురం, బురుసాయి గ్రామాల్లో మహాశక్తిలో భాగంగా బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ ర్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ వైసిపి పాలనలో నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజు, ప్రధాన కార్యదర్శి లబ్బ రుద్రయ్య, క్లస్టర్ ఇన్‌ఛార్జి తమిరి భాస్కరరావు, యూనిట్ ఇన్‌చార్జి సవర శంకర్, సాలిన మాధవరావు, బిసి సెల్ జిల్లా కార్యదర్శి సిర్ల కష్ణారావు, తెలుగు యువత అధ్యక్షుడు నవీన్ కుమార్ పాల్గొన్నారు.

అరసవల్లి వసతిగృహ నిర్మాణానికి విరాళం

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ అంధవరపు వరహానరసింహం (వరం) జయంతిని పురస్కరించుకొని ఆయన కుటుంబ సభ్యులు అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ పరిదిలో వసతిగృహ నిర్మాణానికి రూ.2.50 లక్షలు విరాళంగా ఆదివారం అందజేశారు. వరం ఛారిటబుల్ ట్రస్టు ఆధర్యాన ఆయన కుమార్తె పైడిశెట్టి జయంతి, కుమారులు అంధవరపు ప్రసాద్, సంతోష్‌లు ఆలయాన్ని సందర్శించి ఇఒ వి.హరిసూర్యప్రకాష్, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మలకు చెక్కును అందజేశారు. కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

పుస్తకాలు చదవడం ద్వారా మనకు సంస్కారం, వినయ విధేయతలు నేర్చుకోవచ్చనని శాఖాగ్రంథాలయాధికారి పి.వరలక్ష్మి అన్నారు. రణస్థలంలోని గ్రంథాలయంలో నెలలో మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఇందులో భాగంగా పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, మ్యాగజైన్లనులు, కథలు, నవలలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాలను ప్రదర్శించారు. ప్రతి ఆదివారమూ జరిగే చదవడం మాకిష్టంలో విద్యార్థులకు నచ్చిన కథల పుస్తకాలను, దినపత్రికల పఠనం చదివిస్తున్నామని అన్నారు. వృద్ధులు, గృహిణులు,


బహుమతులను అందజేస్తున్న శివప్రసాద్


కథల పుస్తకాన్ని చదువుతున్న విద్యార్థి

పాఠకులు, విద్యార్థినీ, విద్యార్థులు సభ్యత్వం పొంది గ్రంథాలయంలని పుస్తకాలను చదువుకునేందుకు ఇంటికి తీసుకెళ్లాలని అన్నారు. అనంతరం తెలుగు పద్యాలు, కథలు పోటీలో పాల్గొన్న జి.అప్పన్న, ఎం.హరి, దుర్గాప్రసాద్, జి.నాగచైతన్య విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గుడిపాటి శివప్రసాద్, గణిత ఉపాధ్యాయులు టి.సత్యం పాల్గొన్నారు.

లావేరు : ప్రతి విద్యార్థీ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. లావేరు శాఖాగ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య పాల్గొన్నారు.

ధర్మాన సోదరులను కలిసిన శాంతిశ్రీ

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా మహిళా, శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా శాంతిశ్రీ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఇందులో భాగంగా ధర్మాన సోదరులను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. విధి నిర్వహణలో సమర్ధవంతంగా పనిచేయాలని మంత్రి సూచించారు. అనంతరం పోలాకి మండలం మబుగాంలో నరసన్నపేట ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.


కృష్ణదాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శాంతిశ్రీ


జీవామృతం తయారు చేస్తున్న రైతులు

ద్రవజీవామృతం తయారీ


ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని ప్రకృతి వ్యవసాయ విభాగం భాగంగా రైతులు వరి పొలం వద్ద వెయ్యి లీటర్ల ద్రవ జీవామృతాన్ని మండల యాంకర్ నక్క చిరంజీవి ఆధ్వర్యాన ఆదివారం తయారు చేశారు. ఈ సందర్భంగా డిజిటల్ ఎల్‌టు సురేష్ మాట్లాడుతూ వరి పంట పొలం వద్ద శాశ్వత జీవామృతం కుండీలను ఏర్పాటు చేయించామని తెలిపారు. వీటిలో రైతులు ద్రవ జీవామృతాన్ని సులువుగా తయారు చేసుకోవచ్చునన్నారు. వరి పంటలో ఎంత ఎక్కువ మోతాదులో జీవామృతాన్ని నేలకు అందిస్తే పంటలో మంచి దిగుబడులు పొందవచ్చునన్నారు. అలాగే పంటకు జీవామృతాన్ని పిచికారీ చేయడం వల్ల పురుగులు, తెగుళ్ల నుంచి రక్షణ ఉంటుందని అన్నారు.

పైడిభీమవరం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

విశాఖపట్నం స్వర్ణభారతి స్టేడియంలో ఆదివారం జరిగిన ఫస్ట్ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్-23 కరాటే పోటీల్లో 20 మంది తమ విద్యార్థుల అత్యున్న ప్రతిభను కనబరిచి పతకాలు, మెడల్స్ సాధించారని పైడి భీమవరం టైగర్ కరాటే అకాడమిక శిక్షకుడు సింక సంతోష్‌కుమార్ ఆదివారం తెలిపారు. గోల్డ్ మెడల్ సాధించిన వెంకట మేహుల్, జ్యోతి సాయిప్రసాద్, సింక భవిష్య, సూర్య భాస్కర్‌వర్మ, సింక జ్ఞానప్రదీప్, ఈశ్వరసాయి, అంజలి, సిల్వర్ మెడల్ వేద మధుప్రియ, వర్షిక, కుసుమాంజలి, గురుదీపక్, ఠాగూర్ రవీంద్, తనుశ్రీ, బ్రాంజ్ మెడల్ వాసవి, లోహిత, జాహ్నవి, ప్రవళిక, మౌళి మెడల్స్‌తో పాటు ధ్రువపత్రాలు పొందారు. విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు శిక్షకుడు సింక సంతోష్‌కుమార్ ఆనందం వ్యక్తం చేశారు.


మెడల్స్‌ను చూపిస్తున్న విద్యార్థులు

పలువురికి పరామర్శ


మెళియాపుట్టి : సంజీవరావును పరామర్శిస్తున్న గోవిందరావు

ఇచ్ఛాపురం : మండపల్లి మాజీ సర్పంచ్ బర్రి బలరాం రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి ఆదివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ముందుగా బలరాంరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు ప్రేమ్‌కుమార్, తాడి అదిరెడ్డి, చిడిపోతు జగన్నాయకులు, చైర్‌పర్సన్ ప్రతినిధి పిలక సంతోష్, ప్రకాష్ పట్నాయక్, పిట్టా మామయ్య పాల్గొన్నారు.

కొత్తూరు : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో జెడ్‌పిటిసి భాగ్యావతి భర్త త్రినాథరావు మృతి చెందారు. విషయం తెలుసుకున్న పారిశ్రామికవేత్త సిరిపురం తేజేశ్వరరావు కుంటిభద్ర వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ముందుగా త్రినాథరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈయన వెంట సర్పంచ్ ప్రతినిధి అగతముడి రంజిత్‌కుమార, అగతముడి నాగేశ్వరరావు, సరళి సర్పంచ్ పడాల షణ్ముఖరావు, విశ్రాంత ఎంఇఒ బి.రామారావు, కె.విద్యాసాగర్, ఎ.షణ్ముఖరావు, గోవిందరావులు ఉన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని పెద్దపద్మాపురం, సుందరాడ, జలక లింగపురం గ్రామాల్లోని పలువురిని టిడిపి నాయకులు, సామాజికవేత్త మామిడి గోవిందరావు ఆదివారం పరామర్శించారు. సుందరాడకు చెందిన గణపతిదాసు ఇటీవల అనారోగ్యం గురి కావడంతో ఆయనను, పెద్దపద్మాపురానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు లింగాల సంజీవరావును, జలకలింగపురానికి చెందిన గొర్లె శ్రీనివాసరావు తండ్రి అనారోగ్యం గురికావడంతో ఆయనను పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈయనతోపాటు పట్టుపురం ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, ఎంపిటిసి మాజీ సభ్యులు ఎస్.ఎల్లంనాయుడు, ఢిల్లేశ్వరరావు, కేశవరావు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్ : రణస్థలంలోని నేతల ఆదినారాయణ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో, అనారోగ్యంతో పైడిపల్లి అప్పయమ్మలు మృతి చెందారు. విషయం తెలుసుకున్న పంచాయతీరాజ్ ఛాంబర్ జిల్లా అధ్యక్షులు, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రెటరీ, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీనాయుడు ఆదివారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి మజ్జి వెంకటరమణ, గొర్లె గోవింద్, అప్పారావు, సీతారాం పాల్గొన్నారు.